## క్లుప్తంగా

### నేటి నుంచి శిక్షణ

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నుంచి అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ క్రీడపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందని అసోసియేషన్ సభ్యులు దిలీప్, మురళీధర్, సాగర్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 6 గంటలకు హాజరు కావాలని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు: 9490098136, 9502074146ను సంప్రదించాలన్నారు.

### దూదేకుల ముస్లిం గర్జనను జయప్రదం చేయండి

పీలేరు : గుంటూరులో ఈ నెల 29న నిర్వహించనున్న నూర్‌బాషా దూదేకుల ముస్లిం సింహగర్జనను జయప్రదం చేయాలని ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందాదుల్లా కోరారు. శనివారం పీలేరులో పోస్టర్లు ఆవిష్కరించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా దూదేకుల తలరాతలు మారలేదని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సింహగర్జన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేషు, నాయకులు షఫీ, ఇమాముల్, అమీర్‌బాషా, ఖాదర్, ఫజులుల్లా, రామ్‌తుల్లా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### పండుగ వాతావరణంలో మైనార్టీ దినోత్సవం

వాల్మీకిపురం : జాతీయ మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని మంగళగిరిలో జరిగిన రాష్ట్ర ఉర్దూ అకాడమీ పాలకవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమర యోధులు అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా జాతీయ మైనార్టీ సంక్షేమ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ ఏడాది నవంబర్ 11న రాష్ట్రంలోని ఒక చోట రాష్ట్ర స్థాయిలోనూ, 26 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

### లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు

మదనపల్లె : పట్టణంలోని లాడ్జిలలో డీఎస్పీ కేశప్ప వేర్వేరు పోలీసు బృందాలతో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇండియా–పాకిస్తాన్ హైవోల్టేజ్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా బెట్టింగ్‌లు, అసాంఘిక కార్యక్రమాలు నివారించేందుకు.. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు తనిఖీలు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని అన్ని లాడ్జిలు తనిఖీలు చేశామన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా పితృ అమావాస్య పూజలు

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహదేవాలయంలో శనివారం పితృ అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మాత, గోముఖదేవి సమేత శ్రీ హరిహర లింగోద్భవ మహాశివుడికి సప్తధాతు, క్షీర, అన్నాభిషేక, ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివునికి అభిషేకించిన అన్నంతో పితృదేవతలకు అగ్ని ముఖంగా హోమం నిర్వహించి, ఖవ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ట్రస్టు సభ్యులు మురళి మోహన్, సారథి, పద్మ, రాధమ్మ, కోమల, వెంకటేష్ బాబు, శశికళ తదితరులు పాల్గొన్నారు.

### ఊరెళ్లే వారు జాగ్రత్తలు పాటించండి

పెద్దతిప్పసముద్రం : దసరా సెలవులకు బంధువుల ఇళ్లకో, విహార యాత్రలకో వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా చోరీలు జరగకుండా ప్రజలు ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఊళ్లకు వెళ్లే వారు తెలిసిన వాళ్లకో, బంధువులకో, లేదా పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు.

### ద్విచక్రవాహనాల చోరీపై కేసు నమోదు

మదనపల్లె : ద్విచక్ర వాహనాల చోరీపై కేసు నమోదు చేసినట్లు టుటౌన్ ఏఎస్ఐ రమణ తెలిపారు. పట్టణంలోని కప్పలవారివీధికి చెందిన ఆలంవలీ తన షైన్ ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు ఉంచగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. అదే విధంగా మదనపల్లె తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో చిప్పిలి గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు .బైపాస్‌రోడ్డులో పనిప్రదేశం వద్ద తన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఉంచి పనులు చేసుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లిపోయారు. చోరీల ఘటనలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### అండర్-15 సౌత్‌జోన్ జట్టుకు ఎంపిక

వాల్మీకిపురం : అండర్ –15 సౌత్ జోన్ బాలికల జట్టుకు వాల్మీకిపురం క్రీడాకారిణి రుక్సార్ తబసుమ్ ఎంపికైనట్లు సబ్ సెంటర్ కోచ్ సునీల్ కుమార్ తెలిపారు. వెంకటగిరిలో జరిగిన సౌత్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ మీట్‌లో 5 జిల్లాల పోటీలలో ప్రతిభ కనబరచి సౌత్‌జోన్ జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 22 వరకు మంగళగిరి స్టేడియంలో జరిగే ఇంటర్ జోన్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు.

# శరన్నవరాత్రులకు ఆలయాలు ముస్తాబు

నేటి నుంచి ఉత్సవాలు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలోని అమ్మవారి ఆలయాలు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారు. పట్టణంలోని శ్రీ వాసవీ భవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రతి రోజు పూజలు, అభిషేకాలు, అలంకారాలు జరుగుతాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్ తెలిపారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సిటీఎం రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయం, బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయం, భువనేశ్వరినగర్‌లో వెలసిన భువనేశ్వరి ఆలయంలో అమ్మవారు ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలతో భక్తులను ఆశీర్వదిస్తారు. అయ్యప్పనగర్‌లో వెలసిన వేదమాత గాయిత్రిదేవి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేయనున్నారు.

**చౌడేశ్వరిదేవి ఆలయంలో..**

శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో 15న పసుపు, 16న కుంకుమ, 17న వెండి కవచం, 18న గాజులు, 19న అన్నపూర్ణేశ్వరి, 20న సరస్వతి, 21న కనకదుర్గ, 22న మహిషాసురమర్దిని, 23న ధనలక్ష్మి, 24న రాజరాజేశ్వరి అలంకారాలలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు రామచంద్ర తెలిపారు.



విద్యుత్ దీపాల వెలుగులో చౌడేశ్వరిదేవి ఆలయం

**సోమేశ్వరస్వామి ఆలయంలో..**

స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లలితాత్రిపుర సుందరిదేవి అమ్మవారు ప్రతి రోజు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారు. 15న శ్రీ లలితాత్రిపుర సుందరిదేవి, 16న శ్రీ విష్ణుదుర్గ, 17న శ్రీ ప్రత్యంగిరాదేవి, 18న శ్రీ వారాహిదేవి, 19న అన్నపూర్ణదేవి, 20న శ్రీసర్వసతి, 21న శ్రీరాజశ్యామలాదేవి, 22న శ్రీ దుర్గాదేవి, 23న శ్రీ మహాలక్ష్మిదేవి అలంకరణతో భక్తులను ఆశీర్వదిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ తెలిపారు.

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ చీనేపల్లెలో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆయన చెప్పారు.

కలికిరి : కలికిరి పట్టణంలో వెలసిన గ్రామ దేవత ఎల్లమ్మ ఆలయం, పార్వతీ సమేత సోమేశ్వర ఆలయాల్లో ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రామసముద్రం : గుంతయంబాడిలోని శ్రీచౌడేశ్వరి దేవి, రామసముద్రంలోని శ్రీకన్యకాపరమేశ్వరి, దుర్గాలమ్మ, గుంతలపేట, కొండూరులోని శ్రీచౌడేశ్వరి అమ్మవారు తదితర ఆలయాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కలికిరి : పేదల సంక్షేమమే ధ్యేయంగా అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ గెలిపించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం కలికిరి పట్టణం కలికిరి-2 గ్రామ సచివాలయం పరిధిలోని క్రాస్‌రోడ్డు, పోలీస్‌లైన్ వీధి, టీ.బీ.రోడ్డు, బండకాడపల్లి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ పర్యటించారు. 52 నెలల్లో ప్రభుత్వం నుంచి ప్రతి ఇంటికి అందిన సంక్షేమ లబ్ధితో కూడిన బ్రోచర్‌ను అందచేసి, ఇంకా అర్హత ఉండి పథకాలు అందకపోయిన వారికి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ లబ్ధికి దూరం కాకూడదని సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, జేసీఎస్ కన్వీనర్ రెడ్డెప్ప, ఎంఐ హనీఫ్, తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఖాదర్‌వల్లి, మహేంద్రరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

# పూర్వ విద్యార్థుల కలయిక



పూర్వపు విద్యార్థుల గ్రూప్ ఫొటో

మదనపల్లె సిటీ : మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1976–77 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. పూర్వపు విద్యార్థి దివాకర్ క్లాస్‌మేట్స్ పేర్లు, వారి ఫోన్ నంబర్లు సేకరించారు. అందరితో కలిసి చర్చించి సమావేశం ఏర్పాటు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మునిక్రిష్ణయ్య, ఓబయ్య, సురేంద్రనాథ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, అనసూయమ్మ, సుశీలమ్మ, యశోధమ్మలను ఘనంగా సన్మానించారు.

**రూ.1.65 లక్షల వస్తుసామగ్రి వితరణ**

పాఠశాలకు రూ.1.65 లక్షల విలువైన 150 కుర్చీలు, పోడియం, స్పోర్ట్స్ మెటీరియల్‌ను పాఠశాల ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, మహమ్మద్‌ఖాన్, పీడీలు దేవకమ్మ, అన్సర్, సుధాకర్‌లకు అందజేశారు.

# ఇంధనం పొదుపు.. ఆదాయానికి మలుపు

పీలేరు రూరల్ : ఇంధనం పొదుపు ఆదాయానికి మలుపులాంటిదని డిపో మేనేజర్ వి.కమార్ అన్నారు. గత నెలలో ఇంధనం పొదుపు అత్యధికంగా సాధించిన డ్రైవర్లకు అభినందన సభ నిర్వహించారు. వి.ఎల్.నాయుడు, పి.పి. రెడ్డిలకు మొదటి, ద్వితీయ బహుమతులు అందజేశారు. టైరు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా బస్సుల మరమ్మతుల పనులు పరిశీలించారు. గ్యారేజీ ఎంఎఫ్ హరినాథరెడ్డి, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : బస్సులను సమయపాలన ప్రకారం నడిపి ప్రయాణికుల ఆదరణ చూరగొనాలని ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. శనివారం స్థానిక డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగుల అభినంద, టైర్ల సంరక్షణ పక్షత్సోవాలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన కండక్టర్లు గోపాల్, గోవిందయ్య, వై.ఎస్.ఎస్.రెడ్డి, డ్రైవర్లు ఆర్ ఎల్ రెడ్డి, జీ.ఎ.ఖాన్ తదితరులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ గీత, లచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న డిపో మేనేజర్

### హెల్మెట్ తప్పనిసరి

ములకలచెరువు : ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలని ఎస్ఐ గాయత్రి ఆదేశించారు. శనివారం స్థానిక తంబళ్లపల్లె రోడ్డు వద్ద ఎస్ఐతో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. అలాగే మండలంలోని కదిరి రోడ్డు సమీపంలో ఉన్న మద్యం షాప్ వద్ద ఎస్ఐ తనిఖీ చేశారు.

వాల్మీకిపురం : పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఎస్సై నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

మదనపల్లె సిటీ : మానవ అక్రమ రవాణాను అందరూ కలిసి అరికట్టాలని మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళి అన్నారు. శనివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్టీ ఉన్నత పాఠశాలలో మానవ అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ 'స్వేచ్ఛ కోసం నడక' కార్యక్రమం జరిగింది. ర్యాలీని జడ్జి వెంకటేశ్వర్లునాయక్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ కేశప్ప, సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ హరిహరప్రసాద్, గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర, వెలుగు కన్వీనర్ ఉదయమోహన్‌రెడ్డి, బీటీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

**సమష్టి కృషి అవసరం**

పీలేరు : మానవ అక్రమ రవాణా నిర్మూలనకు సమష్టి కృషి అవసరమని మాజీ ఎమ్మెల్యే జీ.వి.శ్రీనాథరెడ్డి అన్నారు. ఏ21, మూమెంట్ ఇండియా సౌజన్యంతో షీ సంస్థ ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ సంస్థ అధ్యక్షురాలు పి.వి.ఎస్.లక్ష్మీ, న్యాయ సలహాదారులు రాయల సుధాకర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రంకొండ : గుర్రంకొండలో మదనపల్లె మూమెంట్ ఇండియా, రీడో సేవాసంస్థ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు మానవ అక్రమ రవాణాపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఐ దిలీప్‌కుమార్, ఎస్వీ డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ నాగమల్లయ్య, రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐలా ఈశ్వరయ్య, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : తంబళ్లపల్లెలో వాక్‌ఫర్ ఫ్రీడమ్ ర్యాలీ నిర్వహించారు. ఏఎస్ఐ రెడ్డెప్పనాయక్ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్ధిక్, సంస్థ సభ్యులు సిరాజ్, కళ్యాన్, పురుషోత్తం, శివ, నాగేంద్ర, ప్రవీన్, బాబాదీస్, గిరిజన బాలుర రెడసిడెన్షియల్ పాఠశాల టీచర్లు, యువతీ, యువకులు పాల్గొన్నారు.



పీలేరు : ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

# బీజేపీలో మహిళలకు ప్రాధాన్యం

మదనపల్లె : బీజేపీ ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తోందని అన్నమయ్య జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బిజెపి నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. శుక్రవారం రాష్ట్ర బిజెపి నాయకత్వంపై పార్టీ మహిళా నాయకురాలు అంజనాచౌదరి చేసిన ఆరోపణలను ఖండించారు. పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడటంపై సదరు మహిళా నేతపై రాష్ట్ర బిజెపి నాయకత్వంకు ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు ఆకుల కృష్ణమూర్తి, వర్మ, పిల్లా స్వామినాయక్, అజ్మతుల్లాఖాన్, వెంకటేష్, భాస్కర్ రెడ్డి, బాబు పాల్గొన్నారు.

# ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ద్విచక్రవాహనాలు అదుపు తప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మదనపల్లె పట్టణం అనపగుట్టకు చెందిన గంగన్న కుమారుడు శంకర (44) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం భార్య గంగరాజమ్మను ద్విచక్రవాహనంలో తీసుకెళ్లి బి.కొత్తకోటలో వదిలి తిరిగి మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలోని బి.కొత్తకోట మండలం మొగసాలమర్రి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో శంకర తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా వాల్మీకిపురం మండలం కూరపర్తికి చెందిన పి.సత్యం (48) ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళుతూ అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.